క్లుప్తంగా

తపాలా సేవలపై అవగాహన



పోస్టల్ ఖాతాలను నమోదు చేస్తున్న బీపీఎం నాగేంద్ర

పాడేరు రూరల్: తపాలా సేవలపై గ్రామాల్లో విస్తృతం ప్రచారం నిర్వహిస్తున్నట్టు పోస్టల్ శాఖ బీపీఎం జె.నాగేంద్ర తెలిపారు. మండలంలో నలుగు పంచాయతీ కేంద్రంలో ఆయన బుధవారం పర్యటించారు. పోస్టల్ సేవలు, బీమా, పొదుపు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దకే పోస్టల్ సేవలు అందిస్తామన్నారు. పోస్టల్ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల కోసం పోస్టల్ పథకాల్లో ప్రతి నెల చిన్న మొత్తాలతో పొదుపు చేసుకోవాలని, ఇది వారి భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పలు పథకాలపై ఖాతాలను తెరిచారు. సిబ్బంది తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యులు

కొయ్యూరు: మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల-1,2లలో రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యుడు హేమంత్ బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచిన నీటిని వాడాలని సూచించారు. సుమారు 50 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, పలు ఆరోగ్యభద్రత సూచనలిచ్చారు. అనారోగ్యమైతే తక్షణమే వైద్య సేవలు పొందాలన్నారు. సీహెచ్‌వో ప్రశాంత్, కుమార్, ఆరోగ్య సహాయకులు రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు



చింతపల్లి ఆదర్శ పాఠశాలను సందర్శించిన తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి: విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను, జీసీసీ డిపో-1లను ఆయన బుధవారం పరిశీలించారు. పాఠశాలలో రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను సూచించారు. జీసీసీ డిపోలో సరకులను, రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులకు సక్రమంగా సకాలంలో సరకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. హెచ్ఎంలు నర్సింగరావు, విద్యాసాగర్, సేల్స్‌మేన్ మరియా తదితరులున్నారు.

హాస్టల్ తెరిపించాలని వినతి



ఐటీడీఏ ఏపీవో జగన్నాథరావుకు సమస్యను వివరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చింతూరు: పాఠశాలలు ప్రారంభమైనా ఇంకా తెరుచుకోని స్థానిక బీసీ బాలికల హాస్టల్‌ను తెరిపించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఐటీడీఏ ఏపీవో జగన్నాథరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ హాస్టల్‌లో 50 మందికిపైగా విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఉంటూ ఇక్కడే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారన్నారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమై చాలారోజుల కావస్తున్నా ఇంకా హాస్టల్ మాత్రం తెరవలేదని, పాఠశాలలో చదువుతున్న తమ బిడ్డలకు వసతిసౌకర్యం లేక ఇంతవరకు పాఠశాలకు రాలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఇళ్ల వద్దనుండి వచ్చేందుకు తమ గ్రామాలు 40 నుండి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, హాస్టల్‌కు ఇంతవరకు రెగ్యులర్ వార్డెన్‌ను కూడా నియమించలేదన్నారు. ఇద్దరు వర్కర్స్ ఉన్నా వార్డెన్ లేరని, వండేందుకు సరకులు లేవంటూ సాకులు చెబుతూ పిల్లల్ని తిరిగి పంపేస్తున్నారని వారు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా పాఠశాలలో చేరిన పిల్లలకు కూడా ఇదే పరిస్థితి నెలకొందని ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవచూపి హాస్టల్ తెరిచేందుకు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరారు.

రహదారులకు మోక్షమెన్నడో?



చీమలపల్లి వీధి రోడ్డు దుస్థితి

- అధ్వానంగా వీధి రోడ్లు
- చిత్తడి దారులు, అస్తవ్యస్త డ్రైనేజీలు
- రహదారులపై మురుగునీరు
- స్థానికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



బురదమయమైన వ్యూపాయింట్ రహదారి

దుంబ్రిగుడ: గ్రామాల్లోని రహదారులు దారుణంగా ఉన్నాయి. మండలంలోని పోతంగి, అరమ, అరకు, గుంటసీమ, రంగిలిసింగి, కోల్లాపుట్టు తదితర పంచాయతీల్లోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. అధ్వాన డ్రైనేజీలతో రహదారులను మురుగునీరు ముంచెత్తుతోంది. పూడికతీయక కాల్వల్లో చెత్త కుప్పలుగా పేరుకపోతోంది. తీవ్ర దుర్గంధంతో స్థానికులు సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు మెరుగుపరుస్తామని ఇచ్చిన హామీలిచ్చి అమలుచేయలేదు. ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా మన్యంలో ఒక్క ప్రాంతంలో కూడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు. చినుకుపడితే గ్రామీణ రహదారులు చిత్తడిగా మారుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. వాహనాలు జారిపడి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



మామిడిచెట్లు వీధిలోని దారుణ రహదారి

వ్యూ పాయింట్ రహదారిలో ప్రయాణానికి అగచాట్లు

అరకులోయటౌన్: మాడగడ సన్ రైజ్ వ్యూపాయింట్ రహదారిలో ప్రయాణించే వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ రహదారి నిర్మాణానికి వేసిన మట్టి, చిప్స్ వర్షపు నీటితో నిండి చిత్తడిగా మారింది.

ఈ రహదారి మీదుగా ప్రయాణించే ఆటోలు, ఇతర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులతో తీవ్ర నరక యాతన పడుతున్నారు. మండలంలోని స్పోర్ట్స్‌స్కూల్, డిగ్రీ కళాశాల ఆవరణ బురదమయంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల, కళాశాల పరిసరాలు చిత్తడిగా మారాయి. ఈ ప్రాంగణంలో నడిచి వెళ్లలేని విధంగా మారాయి. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



పనసపుట్టు కాలనీలో రోడ్డు దుస్థితి



అరకులోని ఓ వీధిలో అధ్వానంగా రోడ్డు

బురదమయంగా చీమలపల్లి రహదారి

పాడేరు రూరల్: ఐనాడ పంచాయతీ చీమలపల్లి గ్రామంలో వీధి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలో రహదారి చిత్తడిగా మారిందని, అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. చిత్తడి దారి వల్ల తరచూ పాదచారులు, వాహనచోదకులు జారి పడి గాయాలపాలవుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ముంచెత్తుతున్న వరదనీరు



మండల కేంద్రానికి ఒక కిలోమీటరు దూరంలో ఉన్న కోసంగి గ్రామంలో నేటికి సీసీరోడ్డు, డ్రైనేజీ సౌకర్యం లేదు. వరదులు వచ్చినపుడు కొండ వాగు ప్రాంతంలో ఉన్న తమ గ్రామానికి వరదనీటితో పాటు బురద నీరు చొచ్చుకొని వస్తుంది. రాత్రిళ్లు వర్షం పడితే బిక్కుబిక్కు మంటు గడుపుతున్నాం. ఈ సమస్య పరిష్కరించేందుకు మా గ్రామంలో సీసీరోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలి.

– మతం శంకర్, కొసంగి , పోతంగి పంచాయతీ, దుంబ్రిగుడ

దుర్గంధంతో సతమతం



దుంబ్రిగుడ గ్రామం నడిబోడ్డున ఉన్న మామిడి చెట్టు వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పైవీధి నుంచి వచ్చే వరద నీరు నేరుగా గృహాలకు చేరుతుంది. మామిడి చెట్టు వీధిలో బురద కంపుకొడుతుంది. ఇప్పటికైన అధికారులు స్పందించి సీసీతో పాటు డ్రైనేజీ ఏర్పాటు చేయాలి.

– కమ్మిడి సూర్యప్రకాష్, దుంబ్రిగుడ

ప్రతిపాదనలు పంపుతాం

గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ ఏర్పాటుకు పంచాయతీ కార్యదర్శులతో అంచన వేయిస్తాం. ఆయా పనులకు సంబంధించి ప్రతిపాదనలను ఉన్నత అధికారులకు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడతాం.

– ప్రేమ్‌సాగర్, ఎంపీడీవో, దుంబ్రిగుడ.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి: పాడేరు డివిజన్ పరిధిలో ఈ నెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎల్.సీహెచ్.పాత్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లో గల 33కేవీ పాడేరు-జి మాడుగులు ఫీడర్ మర్మమ్మతుల నిమిత్తం జి.మాడుగులు మండలంలో గల అన్ని గ్రామాలకు చింతపల్లి సెక్షన్‌లో గల అన్నవరం ఫీడర్ మరమ్మత్తుల నిమిత్తం అన్నవరం, జెర్రల, వంచుల ,లోతుగెడ్డ, బలపం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అదే విధంగా కొయ్యూరు సెక్షన్‌లో గల శరభన్నపాలెం ఫీడర్‌లో శరభన్నపాలెం, నడింపాలెం, పి.మాకవరం, వెలగలపాలెం, కినపర్తి గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన కల్పించాలి



సీడీపీవో రాణి

దుంబ్రిగుడ: మండలంలోని ఆధార్ కార్డుకు నోచుకొని వారు తక్షణమే ఆధార్ కార్డులు చేయించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో రాణి అన్నారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చిన్నారులకు ఎఫ్ఆర్ఎస్, ఈకేవైసీ చేయించుకోనేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి గర్భిణి, బాలింతలు, పిల్లలు కలిగిన ప్రతి ఒక్కరు వారి యొక్క మెబైల్ నంబర్‌ను ఆధార్ కార్డుకు అనుసంధానం చేయించుకోవాలన్నారు. దీంతో అంగన్వాడీ సేవలు అందుతాయన్నారు.

నేడు ఇండియన్ క్రిస్టియన్ డే వేడుక

అరకులోయటౌన్: మండల కేంద్రంలో గురువారం అరకులోయ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిఫ్ ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ డే నిర్వహించనున్నట్టు ఫెలోషిఫ్ ప్రతినిధి రెవరెండ్ బి.ఈ.సంజీవ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరకులోయలోని ఆర్టీసీ రోడ్డు వద్ద జీసస్ ప్రేయర్ హౌస్ చర్చిలో జరిగే వేడుకలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిఫ్ ప్రతినిధులు, సంఘస్తులు పాల్గొవాలని సంజీవ్‌కుమార్ కోరారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీడీవో లవరాజు

అరకులోయటౌన్: అరకులోయ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో 17 మంది ఎంపీటీసీలకు ఏడుగురు మాత్రమే హాజరుకాగా, 14 మంది సర్పంచ్‌లకు కేవలం గన్నెల సర్పంచ్ బి.బి.బొజ్జి మాత్రమే హాజరయ్యారు. సగానికిపైగా శాఖల అధికారులు హాజరు కాలేదు. సర్వసభ్య సమావేశంలో ముఖ్యంగా వైద్యం, విద్య,, రెవెన్యూ సమస్యలపై చర్చ జరిగింది. గ్రామాల్లో వైద్య సేవలు విస్తృతం చేయాలని, పూర్తిస్థాయిలో పాఠశాలలు లేనిచోట ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులను నియమించాలని , ప్రభుత్వ భూముల కబ్జాను అధికారులు అరికట్టాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో లవరాజు, ఎంపీటీసీ సభ్యులు సొనాయి లక్ష్మి, భూర్జ ఆనంద్, ఎల్.బి.భీమరాజు, శత్రుఘ్న, స్వాహి రామచందర్, డిప్యూటీ తహసీల్దార్ గోవిందు, ఏపీఎం శెట్టి కృష్ణారావు, ఎంఈవో భారతి రత్నం హౌసింగ్, పీఆర్ ఏఈలు కాంతి, గోపి కృష్ణ, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, గన్నెల, మాడగడ పీహెచ్‌సీ వైద్యాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారుల ఎదురుచూపులు

- కానరాని ఉపాధ్యాయులు
- నిరాశలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు



ఉపాధ్యాయుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

సీలేరు: జి.కె.వీధి మండలం దారకొండ పంచాయతీ పేట్రాయి గ్రామంలోని జి.పి.ఎస్.టి. డబ్ల్యూ పాఠశాలలో సుమారు 45 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయులు ఎప్పుడొస్తారని చిన్నారులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల పునఃప్రారంభమై చాలా రోజులు గడిచినా నేటికీ ఒక్క ఉపాధ్యాయులు రాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఉదయం నుంచి రెండు,మూడు గంటలు పాఠశాలలో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోవడంతో నిరాశగా ఇంటిబాట పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. చదువులు సాగక తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని స్థానికులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, సీపీఐ, గిరిజన సంఘం నాయకులు భగవాన్, నాగేశ్వరరావు, బలరాం తదితరులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్య

- వంద గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా
- తాగునీటికి తప్పని అవస్థలు



బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన జనరేటర్

కొయ్యూరు: కాకరపాడు 33/11 కేవీ మెయిన్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా వంద గ్రామాలు మంగళవారం రాత్రి అంధకారంలోకి వెళ్లాయి. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో సరఫరా నిలిచిపోయింది. స్థానిక సిబ్బంది సమస్య సరిచేయలేకపోయారు. దీంతో బుధవారం ఉదయం సింహాచలం నుంచి వచ్చిన నిపుణులు దానిని పరిశీలించారు. మధ్యాహ్నానికి విద్యుత్ పునరుద్ధరణ చేశారు. దాదాపు 18 గంటలాటు విద్యుత్ నిలిచిపోవడంతో తాగేందుకు నీరు కూడా లేకుండా పోయింది. వసతిగృహాల్లో వంట చేసేందుకు అవసరమైన నీరు కూడా రాలేదు. రాజేంద్రపాలెం నుంచి కొయ్యూరు వరకు తాగునీరు సరఫరా నిలిచిపోయింది. చివరకు రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు జనరేటర్ ఏర్పాటు చేసుకుని నీటి సమస్యను లేకుండా చేశారు.

ఆత్మీయ సన్మానం



టీచర్ లక్ష్మిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: బాబుశాల పంచాయతీ కాంద్రంగివలస గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు లక్ష్మిను బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. తమ పిల్లలకు చదువుతో పాటు మంచి క్రమశిక్షణ, ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయురాలు వెళ్లిపోవడం బాధాకరం అని గ్రామస్తులు రాజేంద్రప్రసాద్, నరేంద్రకుమార్, సూరిపడాల్, సుందరరావు, మాధవరావు తదితరులు చెప్పారు. ఉపాధ్యాయురాలు లక్ష్మీకి శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు సింహాద్రి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



కోతులగుట్టలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కూనవరం: మండలంలోని కోతులగుట్ట రైతు సేవా కేంద్రంలో గిరిజన రైతులకు విత్తనాలను ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో సీహెచ్.దేవి మాట్లాడుతూ మండలానికి 771 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జగ్గవరం, కొండ్రాజుపేట, చినార్కూరు, కరకగూడెం తదితర గ్రామాలకు చెందిన సుమారు 70 మంది రైతులకు 120 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. సర్పంచ్‌లు కారం పార్వతి, సున్నం అభిరామ్, నాయకులు సత్యనారాయణ, ప్రకాశరావు, అప్పారావు, గుజ్జాబాబు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలి



కుంజా శ్రీను

రంపచోడవరం: మండలంలోని నరసాపురంలో నిర్వహిస్తున్న అక్రమ మెటల్ క్వారీ నిర్వాహకులపై కేసులు పెట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన అందజేశారు. మెటల్ క్వారీ నిర్వహణపై ఫిర్యాదు చేయడం, పీవో విచారణకు ఆదేశించడం జరిగిందన్నారు. దీనిపై అక్రమ మైనింగ్ మాఫియా రెచ్చిపోయి నరసాపురం గ్రామస్తులను ప్రలోభాలకు గురిచేస్తోందన్నారు. దీనిపై ఐటీడీఏ పీవో తక్షణమే స్పందించి అక్రమ మైనింగ్ దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అక్రమ మైనింగ్‌పై ఐటీడీఏ పీవోకు, మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్ అండ్ డైరెక్టర్, జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో అక్రమదారుల గుండెల్లో గుబులుపుట్టిందన్నారు. ఏజెన్సీలో అక్రమ క్వారీలపై సమగ్ర దర్యాప్తుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏజెన్సీ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ వెంకటలక్ష్మి

రంపచోడవరం: హృద్రోగుల ప్రాణాలను కాపాడే ఇంజక్షన్లను రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి కోరారు. కాకినాడలో బుధవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు ఏజెన్సీ సమస్యలతో పాటు రంపచోడవరం ఏరియా ఆస్పత్రి గురించి మాట్లాడారు. ఇటీవల గుండె నొప్పితో ఐ.పోలవరానికి చెందిన గిరిజన మహిళ ఆస్పత్రికి వస్తే కార్డియాలజిస్టు లేరని చెప్పడం దారుణమన్నారు.తక్షణమే ఆస్పత్రికి కార్డియాలజిస్టు సేవలు అందుబాటులో తీసుకురావాలని కోరారు. అమ్మకు వందనం పథకం సొమ్ములు చాలా మందికి మంజూరు కాలేదన్నారు. దీంతో పాటు పలు ఏజెన్సీ సమస్యలను ఆమె ప్రస్తావించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనను వ్యతిరేకించాలి

పాడేరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు చట్టాలను అణగదొక్కేందుకే కొత్తగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువస్తోందన్నారు. కార్మికుల హక్కుల నిర్వీర్యానికి కుట్ర చేస్తే ప్రతిఘటన ఉద్యమం తప్పదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనకు అంతం చేసేందుకు కార్మికులందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఫారెస్ట్, ఐటీడీఏ, టూరిజం, మెడికల్, గిరిజన సంక్షేమ, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సుమారు 5వేల మందికి పైగా ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్‌గా పనిచేస్తున్న కార్మికులందరికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు, పదవీ విరమణ బెనిఫిట్స్ స్కీమ్ అమలు చేయాలన్నారు. జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మె చారిత్రాత్మకమైందన్నారు, కార్మికులందరూ విధిగా సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు, ఈ కార్యక్రమం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సుందర్‌రావు తదితరులు పాల్గోన్నారు.

పాఠశాల నిర్వహణపై ప్రత్యేక చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో విజయనాగలక్ష్మి, డీడీవో సుమిత్ర

గూడెంకొత్తవీధి: మండలంలోని దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెం పాఠశాలను ఏటీడబ్ల్యూవో విజయనాగలక్ష్మి, స్కూల్ కాంప్లెక్స్ డీడీవో కె.సుమిత్ర బుధవారం సందర్శించారు. మంగళపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల దుస్థితిపై సమస్యలతో సహవాసం శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళపాలెం జీపీఎస్ పాఠశాలను ఏటీడబ్ల్యూవో విజయనాగలక్ష్మి, డీడీవో సుమిత్ర సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు భవనం కోసం మరోచోట స్థలం చూస్తామన్నారు. విద్యార్థులకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తాత్కాలికంగా పాఠశాలను నిర్వహించేందుకు అనుమతి తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు గిరిబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ గడుతూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంకతో మాట్లాడుతున్న ఆస్పత్రి కమిటీ సభ్యులు హలియారాణి, ఈశ్వరరావు

చింతపల్లి: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జల్లి హలియారాణి, కవడం ఈశ్వరరావులు కోరారు. వారు బుధవారం ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మినరల్ వాటర్ ప్లాంటును, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంకతో సమావేశమయ్యారు. వైద్యులు రోగులను పరీక్షించేందుకు ప్రత్యేక గదులు లేవని, వసతి సమస్య వేధిస్తోందని, సిబ్బందికి స్థానికంగా ఉండేందుకు క్వార్టర్స్ సదుపాయం లేదన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఉన్న సమస్యలను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీనియర్ వైద్యాధికారి లావణ్య, లాబ్ టెక్నిషియన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.